సాక్షి సూర్యాపేట

బుధవారం । 13 । నవంబర్ । 2024



రైతులకు బోనస్ కలేనా..

ధాన్యంలో 17శాతం తేమ ఉండాలనే నిబంధనతో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500 కలగానే మిగిలింది.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 586.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: నిల్
అవుట్ ఫ్లో	: 45,634 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,785
కుడికాల్వ ద్వారా	: 10,200 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,849 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.89 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 396.47 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 396.47 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్



హుజూర్‌నగర్: పార్వతీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



స్వామి వారికి పుష్పాభిషేకం చేస్తున్న పూజారులు

కోటి దీపోత్సవం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని శ్రీ పార్వతీ భీమలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం రాత్రి ఘనంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేయించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి కోటి దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కొండారెడ్డి, పూజారులు, పుర ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పేట మార్కెట్‌లో టోకెన్ విధానం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నుంచి టోకెన్ విధానం అమలు కానుంది. ఏటా సీజన్‌లో వరి ధాన్యం అత్యధికంగా వచ్చే సమయంలో అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ విధానాన్ని అమలు చేస్తుండడం ఆనవాయితీ. కాగా ఈ వానాకాలం సీజన్‌లో సోమవారం నుంచి మార్కెట్‌కు రికార్డు స్థాయిలో 50వేల బస్తాల వరకు ధాన్యం వస్తోంది. ఈ నేపథ్యంలో ఎగుమతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు మంగళవారం సెలవు ప్రకటించారు. ఇదే పరిస్థితి నిత్యం రాకుండా ఉండేందుకు టోకెన్ విధానంలో మార్కెట్‌కు ధాన్యాన్ని అనుమతించనున్నారు. ఈ విధానంలో రాత్రి 12గంటల నుంచి ఉదయం 8గంటల వరకు మాత్రమే రైతులు టోకెన్ తీసుకుని మార్కెట్‌కు రావాల్సి ఉంటుందని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు.

పకడ్బందీగా సర్వే చేయాలి



మునగాల : బరాఖత్‌గూడెంలో సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మునగాల : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు కోరారు. మంగళవారం మునగాల మండలంలోని బరాఖత్‌గూడెంలో సర్వేను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజువారి చేపట్టే కుటుంబాల సంఖ్యను పెంచాలన్నారు. ఆయన వెంట కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ, తహసిల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఏపీఓ శైలజ, గ్రామపంచాయతీ కార్యదర్శి దేవరం శ్వేత, ఆర్‌ఐ ఎస్.రామారావు ఉన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

నూతనకల్: విధుల నిర్వహణలో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని డీఎంహెచ్‌ఓ కోటాచలం సూచించారు. మంగళవారం నూతనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి కీసర ఆశ్రితారెడ్డి, సీహెచ్‌ఓ శరణ్‌నాయక్, చిన్ని పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న గఫార్ అహ్మద్

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లాలో ఉన్న మీసేవ ఆపరేటర్లు అంకిత భావంతో పనిచేయాలని ఈ-డిస్ట్రిక్ మేనేజర్ గఫార్ అహ్మద్ సూచించారు. మీసేవలో కొత్త సర్వీస్‌లు వాటి ప్రాధాన్యతపై మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మీసేవ ఆపరేటర్లు శ్రీకాంత్, రాజు, వీరబాబు, ప్రవీణ్, గోనె సాగర్, నరేష్, కరుణాకర్ అంజయ్య, సురేష్, మధు, జగదీష్ అనిత, ఉమాదేవి, పద్మావతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చివ్వెంల(సూర్యాపేట) : ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య అన్నారు. మంగళవారం చివ్వెంల,కుడకుడ, ఐలాపురం, గాయంవారిగూడెం, ఎంజీ నగర తండా, రోళ్లబండ తండా, మంగళితండా, వాల్యతండా, బి.చందుపట్లలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల వీరన్న, బండారు శ్రీనివాస్, పుప్పాల రవికుమార్, సుభాని, తూము శ్రీనివాస్, అశోక్, రామాచారి, రవీందర్, గురుమూర్తి, శ్రీనివాస్, కవిత, అరుణ, శ్రీజ, బోజిరెడ్డి, సోమయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫీజులుం

- ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు వేలల్లో దండుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- ప్రథమ సంవత్సరం ఫీజు రూ. 520కి సైన్స్ విద్యార్థుల నుంచి రూ. 2,500..
- ద్వితీయ సంవత్సరం ఫీజు రూ.750కి రూ. 3,500 వసూలు
- సైన్స్ కంటే ఆర్ట్స్ విద్యార్థుల నుంచి వెయ్యి తక్కువ వసూలు
- ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్ పేరిట అదనపు దోపిడీ
- రసీదు ఇవ్వడానికి నిరాకరణ



కోదాడ: వార్షిక పరీక్షల ఫీజుల పేరుతో జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యజమానులు దందా మొదలు పెట్టారు. వందల్లో ఉన్న ఫీజును వేలల్లో వసూలు చేస్తున్నారు. ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్ అంటూ అదనంగా దండుకుంటున్నారు. ఇదేమిటని అడిగితే సరైన సమాధానం చెప్పడంలేదని, కనీసం రశీదు కూడా ఇవ్వడంలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

రూ. కోట్లలో 'అధిక' వసూళ్లు

2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మార్చిలో జరిగే వార్షిక పరీక్షల కోసం ఈ నెల 18వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించాల్సి ఉంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 26 ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో మొదటి సంవత్సరంలో 4,853 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 4,651 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న వారిలో 90 శాతం మంది సైన్స్ విద్యార్థులు, 10శాతం మంది ఆర్ట్స్ విద్యార్థులు ఉంటారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్ష ఫీజు రూ.520 కాగా సైన్స్ విద్యార్థుల నుంచి రూ. 2,500 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కాగా ఆర్ట్స్ విద్యార్థుల నుంచి రూ. వెయ్యి తక్కువగా వసూలు చేస్తున్నారు. ఇలా కేవలం మొదటి సంవత్సరం సైన్స్, ఆర్ట్స్ విద్యార్థుల నుంచి దాదాపు రూ.91.23లక్షలు అదనంగా పిండుతున్నారు. ఇక ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్ష ఫీజు 750 రూపాయలుగా ఇంటర్ బోర్డు నిర్ణయించింది. కానీ సైన్స్ విద్యార్థుల నుంచి రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆర్ట్స్ విద్యార్థులకు సైన్స్ విద్యార్థుల కంటే వెయ్యి రూపాయలు తక్కువగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో మొత్తం 4,651 మంది ద్వితీయ సంవత్సరం సైన్స్, ఆర్ట్స్ విద్యార్థుల నుంచి ఇలా దాదాపు కోటిన్నర వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. వాటిల్లో మంచి మార్కులు వేయాలంటే అడిగినంత చెల్లించాల్సిందేనని చెబుతున్నారని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు.

రసీదు ఇవ్వడంలేదు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల నిర్వాహకులు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో పరీక్ష ఫీజులు వసూలు చేస్తుండడంతో కొన్ని చోట్ల తల్లిదండ్రులు వారితో వాగ్వాదానికి దిగుతున్నారు. తమకు రసీదు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. దీనికి తెలివిగా కళాశాలల నిర్వాహకులు పరీక్ష ఫీజుతో పాటు ఇంటర్నల్ పరీక్షల ఫీజు అంటూ తాము వసూలూ చేస్తున్న మొత్తానికి కలిపి రసీదు ఇస్తున్నారు. అధికారులకు ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే తాము పరీక్ష ఫీజు కరెక్ట్‌గానే తీసుకుంటున్నామని, మిగతాది ఇంటర్నల్ పరీక్షల కోసం తీసుకుంటున్నామని చెబుతూ తెలివిగా తప్పించుకుంటున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికారులకు కూడా ఈవిషయం తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఇంటర్‌బోర్డు అధికారులు పరీక్ష ఫీజుల పేరుతో చేస్తున్న దందాపై దృష్టి సారించాలని, అధికంగా వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తలిదండ్రులు కోరుతున్నారు.

అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ జూనియర్ కళాశాలల నిర్వాహకులు పరీక్ష ఫీజు ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ. 520 , ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థుల నుంచి రూ. 750 మాత్రమే వసూలు చేయాలి. తల్లిదండ్రుల అడిగితే రశీదు ఇవ్వాలి. అధికంగా వసూలు చేసినట్లు నిర్దిష్టంగా ఫిర్యాదు వస్తే విచారణచేసి చర్యలు తీసుకుంటాం.

– భానునాయక్, జిల్లా ఇంటర్ బోర్డు అధికారి.

కాలేజీలు	సంఖ్య	ఫస్టియర్ విద్యార్థుల సంఖ్య	సెకండియర్ విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ	08	1,437	1,413
మోడల్	09	844	791
సోషల్ వెల్ఫేర్	08	512	564
టీటీడబ్ల్యూఆర్ఎస్	03	139	81
టీఎండబ్ల్యూ ఆర్ఎస్	04	174	194
ఎంజేపీటీడబ్ల్యూఆర్ఎస్	08	359	434
టీఎస్ఆర్‌జే	01	63	41
కేజీబీవీ	05	210	153
ప్రైవేట్	26	4,853	4,651
మొత్తం	72	8,591	8,325

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. మంళవారం సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి, బాలెంల, రామన్నగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలు, వాటి నాణ్యతను, తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకువచ్చేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కొనుగోళ్ల అనంతరం మిల్లులకు తరలించడం, దిగుమతి చేసుకునే ప్రక్రియ వేగంగా జరగాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ త్వరగా చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో 48గంటల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ శ్యాంసుందర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో అధికారులు

కాంటాలైన ధాన్యాన్ని మిల్లులకు పంపాలి

అర్వపల్లి: కాంటాలైన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. జాజిరెడ్డిగూడెంలోని సబ్‌మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేయాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఏఓ గణేష్, ఏఈఓ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెంలోని సబ్‌మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో తహసీల్దార్ శ్రీనివాసులు

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

హుజూర్‌నగర్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్యపద్మ, స్వామి రామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సాయి లక్ష్మి అన్నారు. హుజూర్‌నగర్‌లో శారదా నికేతన్ మహిళా మండలి ఆధ్వర్యంలో రామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ వారిచే కంప్యూటర్, కుట్టుమిషన్ శిక్షణ పొందిన మహిళలు, యువతులకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉపయోగపడే విధంగా మహిళా మండలిని తీర్చిదిద్దటంలో పశ్య కన్నమ్మ శ్రమను వారు కొనియాడారు. కార్యక్రమంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు విహారికృష్ణ, కిషోర్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, జిల్లా నాయకురాలు దేవర మల్లీశ్వరి, మహిళా నాయకులు పశ్య కన్నమ్మ, జూలకంటి అరుణ, ఉమా, కంప్యూటర్, టైలరింగ్ శిక్షకులు బండి ప్రమీల, లలిత పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ

26న టీఎమ్మార్పీఎస్ విజయోత్సవ మహా సభ



మహా సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : ఈ నెల 26న సూర్యాపేట పట్టణంలోని సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో టీ ఎమ్మార్పీఎస్ విజయోత్సవ మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ మాదిగ తెలిపారు. సూర్యాపేటలో మహాసభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభకు మాదిగ, మాదిగ ఉపకులాలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాషపంగు సత్యం మాదిగ, రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి వెంకన్నమాదిగ, ఒగ్గు వెంకన్న మాదిగ, పాతకోట్ల రమేష్ మాదిగ, వల్దాస్ శంకర్ మాదిగ, మామిడి సైదులు మాదిగ, ములకలపల్లి కాటయ్య మాదిగ, నకరికంటి వెంకన్న మాదిగ, ఒగ్గు రాజు మాదిగ, నకిరెకంటి రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలి

అర్వపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి కోరారు. అర్వపల్లిలో మంగళవారం ఇంటింటి సర్వేను పరిశీలించి మాట్లాడారు. సర్వేకు వెళ్లినప్పుడు ఆయా కుటుంబాల సమగ్ర వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రజలు .. ఎన్యుమరేట్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ గణేష్, సూపర్‌వైజర్ ఉపేందర్, ఏఈఓ సత్యం, ఎన్యుమరేటర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సూర్యాపేట : ఈ నెల 14 నుంచి 20వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఈ నెల 14న జ్యోతి ప్రజ్వలన, 15న పుస్తక ప్రదర్శన, 16న వ్యాస రచన పోటీలు, 17న పాటల పోటీలు, 18న కవి సమ్మేళనం, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రారంభ వేడుకలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. పాఠకులు ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ, జిల్లా గ్రంథాలయ అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.శ్యాంసుందర్‌రెడ్డి, ఆయా గ్రంథాలయాల లైబ్రేరియన్లు ఎం.వి.రంగారావు, ఆర్. విజయభాస్కర్, సైదానాయక్, ఎం.వెంకట్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు సన్నద్ధం

- ఈ నెలాఖరులో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- ఈసారి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ మనక్ కలిపి నిర్వహించేలా ప్రణాళిక

సూర్యాపేటటౌన్: వైజ్ఞానిక, గణిత, పర్యావరణ అంశాలపై జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమైంది. ఈ నెలాఖరు నాటికి నిర్వహించేలా అధికారులు కసరత్తు చేశారు. మొత్తం ఎంచుకున్న అంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో అత్యుత్తమంగా నిలిచే 14 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయనున్నారు. ముఖ్యంగా రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ మండలి సైన్స్‌ఫెయిర్ పేరును రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనగా మారుస్తూ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ మనక్ రెండు కలిపి నిర్వహించనున్నారు.

అన్ని పాఠశాలలు పాల్గొనేలా..

జిల్లాలో 543 ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. వారికి తోడు ఉపాధ్యాయులు బోధనోపకరణ(టీఎల్‌ఎం) ప్రదర్శించే అవకాశం ఉంది. గతేడాది పలు కారణాలతో ఆన్‌లైన్‌లో ఈ ప్రదర్శన నిర్వహించడంతో కేవలం కొంత మంది విద్యార్థులు మాత్రమే పాల్గొనే అవకాశం కలిగింది. ఈ సారి జిల్లా కేంద్రంలో ప్రత్యక్షంగా విద్యార్థులు పాల్గొనేలా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రధాన అంశం, ఏడు ఉప అంశాలపై సైన్స్‌ఫెయిర్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 'సుస్థిర అభివృద్ధిలో స్థిరమైన భవిష్యత్ నిర్మాణంలో శాస్త్ర సాంకేతిక పాత్ర' అనే ప్రధానం అంశంతో ఏడు ఉప అంశాలపై జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు.



ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

జూనియర్, సీనియర్ విభాగాల్లో..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జూనియర్ విభాగంలో 6 నుంచి 8వ తరగతి వరకు, సీనియర్ విభాగంలో 9, 10వ తరగతులకు అవకాశం కల్పిస్తారు. నిర్దేశించిన ప్రధానంశంతో పాటు ఉప అంశాల్లో నమూనాలు తయారు చేయాలి. ఒక్కో పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు గైడ్ టీచర్‌గా వ్యవహరిస్తారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ విద్యార్థులు సైతం తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించవచ్చు.

ప్రతి పాఠశాల నుంచి పాల్గొనాలి

గతేడాది కొన్ని కారణాల వల్ల జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రత్యక్షంగా నిర్వహించలేదు. ఆన్‌లైన్‌లోనే నిర్వహించాం. ఈ ఏడాది ప్రత్యక్షంగా జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించేందుకు ఆదేశాలు వచ్చాయి. ఈ నెల చివరిలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నాం. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ప్రాజెక్టులు తీసుకొచ్చేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ప్రతి పాఠశాల నుంచి 14 ప్రాజెక్టులు రూపకల్పన చేసుకొని సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనాలి.

– దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్‌కు 55 ప్రాజెక్టులు ఎంపిక

జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌తో పాటు ఇన్‌స్పైర్ మనక్ (2023–24) కూడా నిర్వహించనున్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన 55 ప్రాజెక్టులు ఇందులో ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థుల ఖాతాల్లో రూ.10వేల చొప్పున జమ అయ్యాయి. వారు సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, గైడ్ టీచర్ శ్రద్ధ వహించి ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ఎంపికైన ప్రాజెక్టులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఉప అంశాలు ఇవే..

- ఆహారం, ఆరోగ్యం – పరిశుభ్రత
- రవాణా, సమాచార రంగం
- వ్యవసాయం, సేంద్రియ పద్ధతులు
- విపత్తుల నిర్వహణ
- గణిత నమూనాలు
- వ్యర్థాల నిర్వహణ
- వనరుల నిర్వహణ

ఈ అంశాలే కాకుండా ప్రధాన అంశం అనుగుణంగా ఏదైనా నూతన ఆవిష్కరణలు చేయొచ్చు.

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల రైళ్ల కింద పడి ఇద్దరు మృతి

భువనగిరి క్రైం, బీబీనగర్: బీబీనగర్ మండల పరిధిలోని వేర్వేరు చోట్ల రైళ్ల కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పగిడిపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ఎగువ లైన్‌లో 18519 ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు (30) మృతిచెందాడు. అదేవిధంగా సోమవారం రాత్రి బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో దిగువ లైన్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(40) మృతిచెందాడు. రెండు మృతదేహాలను భువనగిరి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుల వివరాలు తెలిసిన వారు 9848222169, 8712568454 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కల్వర్టును ఢీకొని యువకుడి దుర్మరణం

ఆలేరురూరల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆలేరు పట్టణంలోని బైపాస్ రోడ్డుపై గల కల్వర్టును ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన డి. రామకృష్ణ(26) మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో ఆలేరు పట్టణంలోని బైపాస్ రోడ్డులో మ్యాడీస్ హోటల్ దగ్గరకి రాగానే జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టి రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

తిప్పర్తి: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని కారు ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటన తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓర్సు రాములమ్మ(65) సోమవారం రాత్రి రామలింగాలగూడెం నుంచి జంగారెడ్డిగూడేనికి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. మల్లేపల్లివారిగూడెం సమీపంలో వెనుక నుంచి కారు వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో రాములమ్మకు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మంగళవారం మృతురాలి కుమారుడు ఓర్సు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన సిరికొండ ఐలయ్య(38) ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరి చర్లపల్లి సత్యాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ పనుల్లో కదలిక

- దండుమల్కాపురంలో ఎనిమిదేళ్ల క్రితం శంకుస్థాపన
- ఆటోమేటెడ్ మిషన్లు రాకపోవడం, క్రషర్ మిల్లు యాజమాన్యం కేసుతో ఆగిన పనులు
- ఇటీవల ప్రభుత్వానికి అనుకూలంగా కోర్టు తీర్పు
- కొనసాగుతున్న ప్రహరీ, సెక్యూరిటీ రూం నిర్మాణం
- మూడు నెలల్లో మిషన్లు వస్తాయంటున్న రవాణా శాఖ అధికారులు



దండుమల్కాపురంలో వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటయ్యేది ఇక్కడే..

చౌటుప్పల్ రూరల్: వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్‌ల్లో అవినీతిని అరికట్టేందుకు, ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్ల మీద తిరగకుండా నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లో ఆటోమేటెడ్ యంత్రాలతో వాహనాల ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మన రాష్ట్రానికి సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా 2015లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ సమీపంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి పక్కనే 8 నుంచి 12 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.14.40కోట్లతో వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్, ఉద్యోగులు ఉండేందుకు భవనం పూర్తయినప్పటికీ.. స్పెయిన్ నుంచి రావాల్సిన వాహనాలను టెస్టింగ్ చేసే మిషన్లు కొన్ని కారణాల వల్ల రాలేదు. దీనికి తోడు ఫిట్‌నెస్ సెంటర్ ఇక్కడ నిర్మించొద్దని పక్కన ఉన్న క్రషర్ మిల్లు యాజమాన్యం కోర్టులో కేసు వేసింది. దీంతో ఎనిమిదేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల కోర్టులో వేసిన కేసుకు సంబంధించి ప్రభుత్వం వైపే తీర్పు రావడంతో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం ఫిట్‌నెస్ సెంటర్ చుట్టూ ప్రహరీ, సెక్యూరిటీ రూం నిర్మిస్తున్నారు. మరో మూడు నెలల్లో గుజరాత్ నుంచి మిషన్లు ఫిట్‌నెస్ సెంటర్‌కు రానున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

దేశంలోనే మూడోది..

దేశంలోనే మొట్టమొదటిసారిగా మహారాష్ట్రలోని నాసిక్‌లో ఆటోమేటెడ్ వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తర్వాత ఢిల్లీలోని రోహ్‌తక్‌లో ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటైంది. తెలంగాణలో దండుమల్కాపురం గ్రామ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ దేశంలోనే మూడోది అని అధికారులు చెబుతున్నారు. దీనితో పాటు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, మధ్యప్రదేశ్‌లోని చిన్వాడ్, కర్ణాటకలోని బెంగళూరు, రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు చురుకుగా కొనసాగుతున్నాయి.

రోజుకు 400పైగా వాహనాలకు ఫిట్‌నెస్ టెస్ట్

దండుమల్కాపురంలోని వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభమైతే ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని వాహనాలన్నీ ఇక్కడే ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాల్సి ఉంటుంది. అధునాతన మిషన్లతో ఫిట్‌నెస్ చెక్ చేయడం ద్వారా మళ్లీ రెండేళ్ల వరకు ఫిట్‌నెస్ చెక్ చేయనక్కర్లేదు. ఫిట్‌నెస్ సెంటర్‌లో వాహనానికి హెడ్‌లైట్స్, స్టీరింగ్, బ్రేకులు, ఇంజన్, ఇంజన్ వల్ల వచ్చే కాలుష్యం, వాహనం కండీషన్‌ను పరీక్షిస్తారు. ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోతే రిపేర్ గ్యారేజీలకు పంపిస్తారు. దీని వల్ల దండుమల్కాపురం గ్రామ పరిధిలో సుమారు 10కి.మీ.ల వరకు మెకానిక్ షెడ్స్ ఏర్పాటై ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

వాహనదారులకు సులభతరం అవుతుంది



దండుమల్కాపురంలో ఏర్పాటవుతున్న వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ పూర్తిగా ఆటోమేటెడ్. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల వాహనదారులకు ఫిట్‌నెస్ చెకింగ్ సులభం అవుతుంది. ఎలాంటి ఆటంకాలు లేకపోతే మరో 6 నెలల్లో సెంటర్ ప్రారంభమవుతుంది. రవాణ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ మండలాల హెవీ వెహికిల్స్ ఫిట్‌నెస్ టెస్ట్ ఇక్కడే చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం.

– బి. సాయికృష్ణ, యాదాద్రి భువనగిరి జిల్లా రవాణాధికారి

విద్యుదాఘాతంతో రైతు మృతి



సైదులు (ఫైల్)

మునగాల: ట్రాక్టర్‌లోని ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా.. ట్రాక్టర్ ట్రాలీకి విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం తాడువాయి గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడువాయి గ్రామానికి చెందిన చిర్రా సైదులు(55) తన సొంత ట్రాక్టర్‌లో తన వ్యవసాయ భూమిలో పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మంగళవారం వచ్చాడు. ధాన్యాన్ని ఆరబోసేందుకు ట్రాక్టర్ ట్రక్కును పైకి లేపే ప్రయత్నం చేయగా.. పైన ఉన్న విద్యుత్ తీగలు ట్రాక్టర్ ట్రాలీకి తగలడంతో విద్యుదాఘాతానికి గురై డ్రైవింగ్ సీటులో ఉన్న సైదులు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భైరవునిబండ గ్రామంలో పశువుల కాపరి..



యాదయ్య (ఫైల్)

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామంలో జరిగింది. మంగళవారం ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. భైరవునిబండ గ్రామానికి చెందిన పులిగిల్ల గంగయ్య సోమవారం ఊరికి వెళ్తూ తన గేదెలను మేపేందుకు గ్రామానికే చెందిన మణికొండ యాదయ్య(58)ను ఒక్కరోజు కూలీగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో యాదయ్య గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో గంగయ్యకు చెందిన గేదెలను మేపేందుకు తోలుకెళ్లాడు. గేదెలను మేపుతుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగ యాదయ్య కాలికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. పక్కనే గేదెలను మేపుతున్న పశువుల కాపరులు గమనించి యాదయ్య వద్దకు రాగా అప్పటికే అతడు మృతిచెందాడు. విషయాన్ని గ్రామస్తులకు తెలుపడంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడకు చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. మంగళవారం మృతుడి కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



రోజా (ఫైల్)

చింతపల్లి: గ్రామస్తుల సూటిపోటి మాటలతో మనస్తాపానికి గురై ఉరేసుకున్న వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటన చింతపల్లి మండలం ధైర్యపురితండాలో జరిగింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ధైర్యపురితండాకు చెందిన వాంకుడోత్ హరినాయక్, రోజా(25) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. వీరు తండాలో కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే తండాకు చెందిన వాంకుడోత్ కళ్యాణ్ కొన్నిరోజుల నుంచి రోజాను ప్రేమిస్తున్నానని ఆమె వెంట పడుతున్నాడు. ఆమెకు ఒక సెల్‌ఫోన్ కొనిచ్చి పెళ్లి చేసుకుంటానని కళ్యాణ్ చెప్పడంతో అతడిని నమ్మిన రోజా గత నెల 26వ తేదీన అతడితో కలిసి కారులో వరంగల్ పారిపోయారు. రోజా కుటుంబ సభ్యులు, భర్త వాంకుడోత్ హరినాయక్ ఈ విషయమై కళ్యాణ్ కుటుంబ సభ్యులను నిలదీయడంతో మరుసటిరోజు రోజాను కళ్యాణ్ తిరిగి గ్రామానికి తీసుకొచ్చాడు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకొని రోజా తన భర్త వెంట కాపురానికి వెళ్లింది. అప్పటి నుంచి కళ్యాణ్ తల్లిదండ్రులు వాంకుడోత్ వెంకటి, శారద సూటిపూటి మాటలతో రోజాను వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల 30వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త వాంకుడోత్ హరి నాయక్ ఫిర్యాదు మేరకు వాంకుడోత్ కళ్యాణ్, అతడి తల్లిదండ్రులు వెంకటి, శారదతో పాటు కళ్యాణ్ బంధువులు రమావత్ రమేష్, శ్రీరామ్, వాంకుడోత్ పవన్, కిషన్, రవి, విజయ్, లచ్చు, కారు డ్రైవర్ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి: కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి చొరవతో అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం భూదాన్‌పోచంపల్లి మండలం గౌస్‌కొండ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో రైతులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతులు తాము పండించిన ధాన్యం అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో ఆయన ఇటీవల గౌస్‌కొండ, రేవనపల్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారని పేర్కొన్నారు. కొనుగోళ్లను త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశించడంతో జిల్లా అధికారులు స్పందించి మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, దోసపాటి అంజయ్య, దేవేందర్‌గౌడ్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టును దర్శించుకున్న అఘోరీ

నార్కట్‌పల్లి: వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అఘోరీ నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై పార్వతీ జడల రామలింగేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకుంది. పంచరామాలను దర్శించుకుని హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో చెర్వుగట్టును దర్శించుకునేందుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. దుస్తులు ధరించి స్వామివారిని దర్శనం చేసుకోవాలని దేవాలయ అధికారులు సూచించడంతో అఘోరీ దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకుంది. భక్తులు మహిళా అఘోరీని చూడటానికి ఎగబడ్డారు.



చెర్వుగట్టులో పూజలు చేస్తున్న అఘోరీ

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- ఆమెతో పాటు హోటల్ క్వార్టర్స్‌లో ఉంటున్న యువకుడు పరారీ
- అతడే హత్య చేసినట్లు భావిస్తున్న పోలీసులు



ఝాన్సీ మృతదేహం

కేతేపల్లి: కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో గల 'మా పల్లె రుచులు' హోటల్‌లో పనిచేసే మహిళ హోటల్ సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆమెతో పాటు ఉంటున్న యువకుడు కనిపించకపోవడంతో అతడే హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. హోటల్ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన గంగాధర ఝాన్సీ (35), నల్లగొండ జిల్లా పెద్దవూర మండలానికి చెందిన పెద్దమళ్ల కోటేశ్వరావు అలియాస్ బన్నీ కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట గల మా పల్లె రుచులు హోటల్‌లో ఇరవై రోజుల క్రితం పనిలో చేరారు. వీరు హోటల్ వెనకాల సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. ఝాన్సీకి పెళ్లై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఝాన్సీ, బన్నీ ఒకే హోటల్‌లో పనిచేస్తుండటంతో వీరి మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో వీరిద్దరూ హోటల్‌లోని క్వార్టర్స్‌లో ఒకే గదిలో నివాసముంటున్నారు. సోమవారం రాత్రి హోటల్‌లో విధులు ముగించుకుని తమ గదికి వెళ్లిన బన్నీ, ఝాన్సీ మంగళవారం ఉదయం నిద్రలేచి హోటల్‌లో టిఫిన్ చేసి తిరిగి గదికి వెళ్లారు. మధ్యాహ్నం వరకు వారు విధులకు రాకపోవడంతో అనుమానం వచ్చిన హోటల్ యాజమాన్యం గదిలోకి వెళ్లి చూడగా ఝాన్సీ విగతజీవిగా మంచంలో పడి ఉంది. బన్నీ కోసం వెతకగా అతడి ఆచూకీ లభించలేదు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. నల్లగొండ నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బన్నీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

గోవులను తరలిస్తున్న వాహనాలు స్వాధీనం



వాహనంలోని గోవులు

మునగాల: కోదాడ నుంచి హైదరాబాద్ వైపు గోవులను తరలిస్తున్న రెండు వాహనాలను మంగళవారం మునగాల మండల కేంద్రం శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి రెండు టాటా ఏస్ వాహనాలలో 17 గోవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మునగాల మండల కేంద్రంలో శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి ఓ వాహనం డ్రైవర్ పరారు కాగా.. రెండో వాహనం డ్రైవర్‌ను పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా నామవరం గ్రామానికి చెందిన గొడ్ల బాబ్జి జగ్గంపేట నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు గోవులను తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. మొదటి వాహనంలో 9, రెండో వాహనంలో 8 గోవులు ఉన్నట్లు గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు, పట్టుబడిన గోవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణ తాపడానికి రూ.5లక్షల విరాళం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం హైదరాబాద్‌కు చెందిన రాగాల శివశాంత్ కుమార్, రాగాల శ్రీనివాస్ రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. మంగళవారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం శివశాంత్ కుమార్, శ్రీనివాస్ రాగాల ఫౌండేషన్, రాగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ డీజీపీ ఆర్‌కే రాగాల జ్ఞాపకార్థం రూ.5లక్షల చెక్కును ఈఓ భాస్కర్ రావుకు అందించారు.



ఈఓ భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న శివశాంత్ కుమార్, శ్రీనివాస్

వాగు ఆక్రమించిన వారిపై కేసు నమోదు

యాదగిరిగుట్ట రూరల్: వాగును ఆక్రమించిన వారిపై యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామానికి చెందిన గౌడ సిద్దులు, సైదాపురం గ్రామానికి చెందిన కనుకుల సిద్ధారెడ్డి మల్లాపురం గ్రామంలోని వాగును ఆక్రమించారు. వీరిపై ఇరిగేషన్ ఏఈఈ తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పబ్లిక్ ప్రాపర్టీస్ డామేజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మహేశ్వర్ (ఫైల్)

కట్టంగూర్: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన తండుకంట్ల మహేశ్వర్(35) గత ఆరేళ్లుగా తన కున్న రెండున్నర ఎకరాలతో పాటు మరో 4 ఎకరాల భూమిని కౌలు తీసుకొని పత్తి పంట సాగుచేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.6లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పు తెచ్చి పత్తి పంట సాగు చేయగా.. కాలం కలిసిరాక పంట దిగుబడి తగ్గిపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. రవీందర్ తెలిపారు.

భువనగిరి ఖిలాను సందర్శించిన రష్యా దేశస్తులు



భువనగిరి ఖిలా వద్దకు బస్సులో వచ్చిన రష్యా నిపుణుల బృందం

భువనగిరిటౌన్: యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు సమీపంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు మంగళవారం రష్యా దేశం నుంచి 25 మంది నిపుణుల బృందం వచ్చారు. వారు పెద్దకందుకూరు నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతూ భువనగిరి ఖిలాను సందర్శించారు. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీకి చెందిన విక్రమ్ ఆధ్వర్యంలో భువనగిరి ఖిలా పైకి ఎక్కిన వారు ఎత్తైన గ్రానైట్ కొండపై నిర్మాణాలను చూస్తూ చాలాసేపు అక్కడే గడిపారు. వందల సంవత్సరాలుగా ఉన్న నిర్మాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అభిప్రాయపడ్డారు. ఖిలా చరిత్రను గైడ్ వినోద్ వారికి వివరించారు.

రైతులకు బోనస్ కలేనా..?

- సన్న రకం ధాన్యాన్ని మిల్లులకే తరలిస్తున్న అన్నదాతలు
- 17శాతం తేమ ఉండాలనే నిబంధనతో వర్షాల భయంతో ధాన్యాన్ని ఆరబెట్టలేక ఎప్పటికప్పుడు మిల్లులకు తరలింపు
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తేనే బోనస్



మిర్యాలగూడ పరిధిలో రైస్ మిల్లు ముందు బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

మిర్యాలగూడ: రైతులు పండించిన వరి పంటకు బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం దానికి అనుగుణంగానే సన్న ధాన్యానికి ఈ సీజన్‌లో రూ.500 బోనస్ ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే గ్రేడ్–1 ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ కల్పిస్తామని ప్రకటించారు. 17శాతం తేమ కచ్చితంగా ఉండాలని, పొట్టు, తాలు, మట్టి పెల్లలు లేకుండా ఉండాలని నిబంధన పెట్టారు. అయితే 17శాతం తేమ ఉండాలంటే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తుంది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితుల్లో రైతులు బోనస్ విషయం పట్టించుకోకుండా ధాన్యాన్ని నేరుగా మిల్లుల్లోనే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధర వస్తున్నప్పటికీ మిల్లుల్లోనే ధాన్యం అమ్ముకుంటున్నారు.

మిల్లులకే సన్న ధాన్యం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో రైతులు సన్న రకం ధాన్యం ఎక్కువగా సాగు చేశారు. దొడ్డురకం ధాన్యం కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. సన్న రకం పచ్చి ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడంతో రైతులందరు మిల్లులకే ధాన్యాన్ని తరలిస్తున్నారు. మిల్లర్లు 25 నుంచి 30శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా తాలు, పొట్టు, మట్టి పెల్లల గురించి మిల్లర్లు పట్టించుకోకపోవడంతో పంట కోసిన వెంటనే రైతులు ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నారు. దీంతో మిల్లుల వద్ద కిలోమీటర్ల మేర ధాన్యం ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 30శాతం ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేసినట్లు సమాచారం. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ 17శాతం తేమ ఉండాలనే నిబంధనతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది.

సన్న రకం ధాన్యం సాగు వివరాలు..

జిల్లా	ఎకరాలు	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)	కొనుగోలు కేంద్రాలు
నల్లగొండ	2,42,490	5,81,975	82
సూర్యాపేట	3,41,650	8,15,960	133
యాదాద్రి	97,028	1,74,650	32

15.72లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 15.72లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా చేశారు. నల్లగొండ జిల్లాలో 2,42,490 ఎకరాల్లో సన్నాలు సాగు చేయగా 5,81,975 మెట్రిక్ టన్నులు, సూర్యాపేట జిల్లాలో 3,41,650 ఎకరాల్లో సాగు చేయగా 8,15,960 మెట్రిక్ టన్నులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 97,028 ఎకరాల్లో పంట సాగు చేయగా 1,74,650 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా చేశారు. ఇప్పటివరకు సుమారు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఇప్పటివరకు గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. ఇలా అయితే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఎలా పంపిణీ చేస్తారనే అనుమానాలు కలుగుతున్నాయి. మిల్లర్ల నుంచి సన్న బియ్యం కొనుగోలు చేసి పేదలకు ఇస్తే ప్రభుత్వంపై మరింత భారం పడుతుంది.

మహేంద్ర చింట్లు కొనని మిల్లర్లు..

దిగుబడి ఎక్కువగా వస్తుందని మహేంద్ర చింట్లు, 101 వరి వంగడాలను సాగు చేసిన రైతులకు మిల్లర్లు చుక్కలు చూపిస్తున్నారు. ఆ రకం ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు ముందుకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 70వేల ఎకరాలకు పైగా ఈ రకం వరి సాగు చేశారు. కానీ ఈ రకం ధాన్యంలో గింజ లావుగా ఉంటుందని, ఇది సన్న బియ్యం వెరైటీకి సరిపోదని కారణంతో మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. అధికారులు అనేకమార్లు మిల్లర్లతో సమావేశం జరిపి ఆ రకం ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ధాన్యం రాక కోసం ఎదురుచూస్తున్నాం

సన్నరకం ధాన్యం కొనుగోలు కోసం నల్లగొండ జిల్లాలో 82 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆయకట్టులో ఎక్కువగా సన్నరకం ధాన్యం సాగు చేయడం వల్ల ఇప్పుడిప్పుడే కోతలు జరుగుతున్నాయి. ధాన్యం రాకకోసం ఎదురుచూస్తున్నాం. వచ్చిన ధాన్యానికి నిబంధనల ప్రకారం మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తాం. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి.

– శ్రీనివాస్, అదనపు కలెక్టర్, నల్లగొండ